# ధర్మ దర్శనం

నేను అట్టే చదువుకోలేదు. తెలిసీ తెలియని ఆడదాన్ని. నాకు బరువైన ఆశయాలంటూ లేవు. అది ఎందుకు. ఇది ఎందుకు అంటూ క్వశ్చన్ మార్క్ కథలూ నావెల్సూ బుక్సూ. అవీ రాసిపారేసి ప్రయిజులూ అవీ కొట్టేసి పేరు గడించేసి. అందరికంటె తెలివైన దాన్నని అనుకుని-పెద్దా పిన్నా లేకుండా అందర్నీ తూలనాడి అందలమెక్కి కూర్చోవాలని నాకులేదు.

నావన్నీ చిన్న చిన్న కోరికలూ చిట్టిచిట్టి సరదాలూను.

నా హద్దైందు నే గీచిన గీటు దాటితే నేనేమీ అనుకోను.

పేచీకోరు విషయాల జోలికి నేను పోను. కళ. సంగీతం. నాట్యం ఇలాటివేమీ నాకు బాగా తెలియవు.

నా ఇష్టాలు సరదాలు కొన్నైనా తీరితే నాకు అందలమెక్కి-నట్లుగానే వుంటుంది. సరదాగా ఓ పుస్తకం చదువుకోడం. ఎవరేనా స్నేహితులు వస్తే కబుర్లు చెప్పుకోడం. సంతోషం కలిగించే విషయమేదైనా వుంటే మనసారా (ముఖంముడుపుట లాడించుకోకుండా) నవ్వటం. ఏడుపొస్తేతలగడా మంచం. పరుపూ. పక్కబట్టలూ కరిగి వరదలై పారేలా ఏడ్చేయటం. భోంచేసినప్పుడు కలో గంజో- పండో-కాయో కూరోనారో తినడం కోసమే పుట్టినట్లు కాకుండా- ఏదో ఒకటి తినేసి చేయి కడుక్కొని లేచి పోవాలి.

అంతేకాని తినేదానిని తినబోయేదానిని తల్చుకుంటూ జీవితం గడిపే వాళ్ళను చూస్తే నాకు పరమరోత.

వంట పొయ్యిదగ్గర పెళ్ళాం కొంగు పట్టుకు కూర్చుని కత్తిపీట కేసి చూస్తో ఆ పనీ ఈ పనీ కల్పించుకుంటూ తిరిగే అర్ధనారీశ్వరులన్నా నాకు చిరాకే-

మొగాడన్నవాడు వంటింట్లోకి. బాత్ రూంలోకి అస్తమానూ పెళ్ళాం ఏం చేస్తోందో అంటూ సి. ఐ. డి. లా అఘోరించకూడదు. స్నేహితులమధ్య- భార్యా భర్తలమధ్య. ప్రేయసీ ప్రియులమధ్య కాస్త ఎడమంటూ వుంటుంది.

ఆ ఎడం లేకపోతే నడుం విరుగుతుంది. లవ్వే వుండదు. ఆ ఎడం కడు రమ్యమైనది.

ఆ దూరాన్ని ఎవరేనా చెరిపేస్తే వాళ్ళు (ఆ ప్రేయసీ ప్రియులు) గాఢంగా జిగురెట్టి అంటించేసినట్టు అతుక్కు- పోతారు

అతుక్కు- పోయిన వాళ్ళు ఎప్పుడో ఒకప్పుడు కుండ బద్దలు కొట్టినట్టు విడిపోవాలి. దట్స్నాల్ రైట్.

మొగుడన్న వాడు బొగ్గులబస్తా సాయం పట్టమంటే పట్టెయ్యాలి

నా కోసం వచ్చే లేడీస్ని అమర్యాదంగా పలకరించి. వేళాకోళా లాడి. ఇంటిదాకా దిగబెట్టొస్తానని తయారవకూడదు. బుద్ధిగా మైండ్ హిజ్ వోన్ బిజినెస్ - తిరగలి రోలూ ఈడ్చుకు రమ్మంటె తేగలిగి వుండాలి.

వంట ఏ మాత్రం- పొయ్యికి క్రిందూ మీదా తెలియని మొగాళ్ళతో పరమ డేంజర్-

కాఫీలు పెట్టి పకోడీలు వేయించ గలిగేపాటి కెపాసిటీ వుంటే చాలు. స్వామి కరుణించెన్ నేటికి నా జన్మ తరియించెన్ అనుకుంటుంది ఇల్లాలు. బైది బై - -పులిహోర బొబ్బట్లు- గారెలు చేస్తాననే నలభీమ పాక శాస్త్రిలు మొగుడయితే ఆ కాపురం అన్నం చిమిడినట్టు చిమిడి తగలడుతుంది ఇదంతా సీతమ్మ ఫిలాసఫీ అని నవ్వి కొట్టిపారేస్తే కొట్టిపారెయ్యండి.

నా ఫిలాసఫీలో,

నా మొగుడూ, నా కాపరం, నా పిల్లలూ వాళ్ళకి గొప్పఇంపార్టెన్స్. నా భర్త నన్ను కాస్త దయగా చూడాలి.

ఓషరు కట్టను ఇత్తడి చెంబును, చెప్పుల జోడును చూసినట్లు చూడకూడదు.

నా పిల్లల కళ్ళలో వెలుగును నేను చూడకలగాలి. వాళ్ళు నన్నో వంటలక్కగానో నన్నూ మావారిని కలిసి మద్రాసు బ్రాహ్మణ భోజన కాఫీ హోటల్ గానో చూడకూడదు. నా జీవితం నవ్వులపాట కావాలిగాని. నవ్వులాట కాకూడదు.

కిటికీ తెరిస్తే మందమలయానిలాలు వీచాలి. పక్కమీదకు వెన్నెలలు కురవాలి.

తలలోని మల్లెచెండు నా భుజంమీద వాలితే నా భుజాలు నా మెడ మల్లెపూల తావితో మంచి గంధం వాసనలతో గుబాళించి పోవాలి.

కొత్త చీర కట్టుకోవడమంటే నా కాట్టే యిష్టంవుండదు.

కొత్త బట్టలలో బిరుగూ, వెలుగు-తళుకూ మెరుపే కాని హాయి సుఖంతక్కువ. చలువ వేసిన జరీఅంచు తెల్లచీర మెత్తగా కన్నతల్లి ప్రేమలా వెన్నెలలా చల్లగా హాయిగా వుంటుంది.

ప్రేమలు కలకాలం ఉండవు. యవ్వనమూ నీడలా పరిగెట్టేది కాని నిలబడేదికాదు. దుస్తులు, అలంకారం భోజనం ఏదీ సయించదు.

ముఖం మీదకు ముడుతలు వచ్చేస్తాయి. మొహం ముడురెక్కుతుంది. నవ్వులో అమాయకత్వం పోయి గిడసబారిన గడుసుతనం స్వార్థం తొంగి చూస్తాయి. అద్దంముందు ఎంతసేపు నిలబడినా ఎన్ని పవుడర్లు, స్నోలు పులిమినా ఆ పదహారో ఏడు మళ్ళీరాదు. ముసలితనం డాబామీద ఎండలా తరుము కొస్తూంటే అప్పుడు గడిచిన యౌవ్వన మధుమాస యామినులు తల్చుకుంటూ ఏడుస్తూ కూర్చోవాలా లేక ఏ మెహర్ బాబానో, సాయిబాబానో వెంకటేశ్వరస్వామి వైపో తిరిగి

పోయి భక్తి పర్వంలోనో పడిపోవాలా? నిజమే. సహస్రాబ్దంగా ర సం
సార జీవితంలోనుంచి భక్తి లోకి వురకాల్సిందే.

కాని ఇల్లుకన్నా గుడి పదిలం అనేవారు పూర్వం. ఇప్పుడామాట రద్దయింది. గుళ్లోకెళ్లిన వాళ్ళు క్యూలో చస్తూంటే. గుడి పదిలం అన్న సామెతను తెలుగులోంచి తొలగించాలి.

అయితే ఒక విషయంమాత్రం ఢంకా బజాయించి చెప్పగల్ను. నాలుగుడబ్బులున్న వాడెవడూ ధర్మ దర్శనానికి ఎగబడడు. సినిమా వాళ్ళు. వ్యాపారస్థులూ. పెద్ద పెద్ద ఆఫీసర్లూ వాళ్ళెవరూ "క్యూ"లో నిలబడరు. క్యూల్లో నిలబడేది రికమెండేషన్లు లేని అలగాజనమే కనుక. తొక్కిడిలో నలిగి ప్రాణాలు పోయినవారి కందరికి దేవుడు మోక్షం ఏలాగూ యిచ్చేస్తాడు.

స్వర్గంలో పై బెర్తులకి కూడా రేట్లుపెట్టేసి అమ్మేస్తే ఎలక్షన్లలో ఓడిపోయిన వారూ, వృద్ధ సినిమాతారలు, బ్లాక్ మార్కెటీర్లు ఎగబడి కొనుక్కుంటారు.

తొక్కిడిలో చచ్చి పోయిన వాళ్ళకు స్వర్గం యిచ్చినట్లే దానికి కారకులైన వాళ్ళను కూడా స్వర్గానికి పంపించే ఏర్పాట్లు చేయాలి.

కాని స్వర్గం మోక్షం ఎంతమంచివైనా ఎవరో దిక్కుమాలిన వాళ్ళకూ ఆ భాగ్యులకూ తప్ప ఎవరికీ స్వర్గస్థులం కావాలని వుండదు, అదేమి చిత్రమో....